నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, మంగళవారం 13 ఫిబ్రవరి 2024 | BHADRADRI KOTHAGUDEM

మన నీళ్లు, మన హక్కుల కోసం పోరాడుదాం

కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి వల్లనే కేఆర్ఎంబీకి కృష్ణా జలాలు

నేటి 'చలో నల్గొండ'కు భారీగా తరలిరండి: ఎంపీ నామా

ఖమ్మం, ఫిబ్రవరి 12: మన నీళ్లు, మన హక్కుల కోసం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నాయకత్వంలో పోరాడడానికి ప్రజలంతా కదలి రావాలని బీఆర్ఎస్ లోక్ సభా పక్ష నేత, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. కృష్ణా నదీ జలాలపై తెలంగాణ హక్కులను కాపాడుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ కేసీఆర్ నేతృత్వంలో మంగళవారం నిర్వహిస్తున్న చలో నల్గొండ భారీ బహిరంగ సభకు జిల్లా ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత వైఖరి వల్ల కృష్ణా బేసిన్‌లోని దక్షిణ తెలంగాణ రైతులు సాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నదీ జలాలను కేఆర్ఎంబీకి కాంగ్రెస్ ప్రభుత్వం అప్పగించిన నిర్ణయం రైతుల మెడపై గొడ్డలి పెట్టులాంటిదని అన్నారు.

పోదాం పద నల్గొండకు..

- నేడు నల్గొండలో బీఆర్ఎస్ బహిరంగ సభ
- హాజరుకానున్న బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్
- ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి భారీగా తరలి వెళ్లనున్న పార్టీ శ్రేణులు
- ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలతోపాటు స్వచ్ఛందంగా వెళ్లనున్న అభిమానులు

ముదిగొండ : బీఆర్ఎస్ బహిరంగ వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఖమ్మం జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

ఖమ్మం, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కృష్ణా నది పరిధిలోని శ్రీశైలం, నాగార్జున సాగర్ తదితర ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం కేఆర్ఎంబీకి అప్పగించడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ నల్గొండలో మంగళవారం నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ఉమ్మడి జిల్లా నుంచి బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలి వెళ్లనున్నారు. జలాల విషయంలో తెలంగాణ రాష్ట్రానికి జరుగనున్న అన్యాయం, భవిష్యత్‌లో సాగు, తాగునీటికి పొంచి ఉన్న ప్రమాదాన్ని నివారించేందుకు బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తల పెట్టిన బహిరంగ సభకు పది నియోజకవర్గాల నుంచి జనసమీకరణ చేసేందుకు వారం రోజులుగా మండల, నియోజకవర్గాలవారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ముఖ్య కార్యకర్తలను సమాయత్తం చేస్తూ.. బహిరంగ సభకు సంబంధించిన వాల్ పోస్టర్లను సైతం ఎక్కడికక్కడ ఆవిష్కరించారు. కృష్ణా ఆయకట్టు పరిధిలో ఉన్న ఖమ్మం జిల్లాకు భవిష్యత్‌లో సాగు, తాగునీటి కొరత పొంచి ఉంది. అంతేకాక నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లోనూ ఈ సమస్య ఉత్పన్నమయ్యే పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ తీరును ప్రజలకు, సాగు రైతులకు వివరించేందుకు బీఆర్ఎస్ పార్టీ ఈ మూడు జిల్లాలతోపాటు భారీ జనసమీకరణ చేయాలని నిర్ణయించింది.

బహిరంగ సభపై విస్తృత ప్రచారం

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఖమ్మం, పాలేరు, సత్తుపల్లి, మధిర, వైరా, కొత్తగూడెం, పినపాక, భద్రాచలం, ఇల్లెందు, అశ్వారావుపేట నియోజకవర్గాల్లో నల్గొండ సభపై బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ బాధ్యులు విస్తృతంగా ప్రచారం చేశారు. అన్ని నియోజకవర్గాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహించారు. బీఆర్ఎస్ పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు నల్గొండ సభకు ఆయా జిల్లాల నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలనే ఆవశ్యకతను వివరించారు. రాష్ట్ర మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఖమ్మం జిల్లాలోని కార్యకర్తలను నల్గొండ సభకు తరలించేందుకు ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. సత్తుపల్లి నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, మధిరలో జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు సన్నాహక సమావేశాలు నిర్వహించడంతోపాటు బహిరంగ సభ పోస్టర్లు ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డిలు చలో నల్గొండ పోస్టర్‌ను ఆవిష్కరించి.. జనసమీకరణపై దృష్టి సారించారు. ప్రతి నియోజకవర్గం, ప్రతి మండలం నుంచి ప్రత్యేకంగా బస్సులు, వాహనాలను ఏర్పాటు చేశారు. నియోజకవర్గం నుంచి కనీసం 50 బస్సులు తరలివెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మాజీ సీఎం కేసీఆర్ అభిమానులు స్వచ్ఛందంగా వాహనాల్లో సభకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, సహకార సంఘాల అధ్యక్షులు, మున్సిపల్, మార్కెట్ కమిటీ చైర్మన్లు సభలో పాల్గొనేలా పార్టీ నేతలు పిలుపునిచ్చారు.

తరలివెళ్లనున్న బీఆర్ఎస్ నేతలు

సభలో ఖమ్మం జిల్లా నుంచి మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథిరెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాళ ఉపేందర్‌రెడ్డి, బానోతు హరిప్రియానాయక్, మెచ్చా నాగేశ్వరరావు, వనమా వెంకటేశ్వరరావు, బీఆర్ఎస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, వైరా మాజీ ఎమ్మెల్యేలు బానోతు మదన్‌లాల్, లావుడ్యా రాములునాయక్ తదితరులు పాల్గొనున్నారు. అనేక మంది నాయకులు, కార్యకర్తలు, కేసీఆర్ అభిమానులు ఛలో నల్గొండ సభకు ఫ్లెక్సీలు, బ్యానర్లు ధరించి తరలేందుకు సిద్ధమయ్యారు.

'చలో నల్గొండ'కు తరలిరండి : మాజీ ఎమ్మెల్యే సండ్ర పిలుపు

నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి టౌన్, ఫిబ్రవరి 12 : నల్గొండలో మంగళవారం బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తలపెట్టిన 'చలో నల్గొండ' బహిరంగ సభకు భారీగా తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి స్థానిక క్యాంపు కార్యాలయంలో నాయకులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చేలా చూడాలన్నారు. ప్రతి గ్రామానికి బస్సులు ఏర్పాటు చేశామని, వాటిని బీఆర్ఎస్ శ్రేణులు సద్వినియోగం చేసుకుని సభకు తరలిరావాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేశ్, నాయకులు కొత్తూరు ఉమామహేశ్వరరావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, యాగంటి శ్రీనివాసరావు, తుమ్మూరు దామోదర్‌రెడ్డి, రఫీ, మల్లూరు అంకమరాజు పాల్గొన్నారు.

అర్జీలను త్వరితగతిన పరిష్కరించండి

ప్రజావాణిలో కలెక్టర్ వీపీ గౌతమ్

కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేస్తున్న ప్రజలు

మధిర, ఫిబ్రవరి 12 : అపరిష్కృత సమస్యలపై ప్రజలు సమర్పించిన అర్జీలను నిశితంగా పరిశీలించి.. వాటిని త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ వీపీ గౌతమ్ వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. మధిర పట్టణంలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. వివిధ సమస్యలపై 106 అర్జీలు వచ్చాయని, వాటిని సంబంధిత శాఖల అధికారులకు ఆమోదం కొరకు పంపించామన్నారు. ప్రధానంగా పశుసంవర్ధక శాఖకు సంబంధించి 33, రెవెన్యూ 25, వైద్య, ఆరోగ్య శాఖ 11, మున్సిపాలిటీలకు సంబంధించి 9 అర్జీలు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీ.సత్యప్రసాద్, జడ్పీ సీఈవో వీవీ.అప్పారావు, డీపీవో హరికిషన్, డీఆర్‌డీవో విద్యాచందన, ఆర్డీవో జీ.గణేశ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

కుల, చేతివృత్తుల ఆర్థికాభివృద్ధికే 'పీఎంవీవై'

భద్రాద్రి అదనపు కలెక్టర్ రాంబాబు

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అదనపు కలెక్టర్

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ) : సాంప్రదాయ కుల, చేతివృత్తుల వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందించేందుకు పీఎం విశ్వకర్మ యోజన(పీఎంవీవై) ఉపయోగపడుతుందని, దీనిని ఆయా వృత్తుల వారు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. ఐడీపోసీ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన అవగాహన సదస్సును ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయా వృత్తుల వారు తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. జిల్లా పరిశ్రమల అధికారి సీతారాం మాట్లాడుతూ కుమ్మరి, కమ్మరి, మంగలి, వడ్రంగి, రజక, వడ్డెర, కంసాలి, దర్జీ వంటి చేతి వృత్తులపై ఆధారపడి జీవించే వారంతా ఈ పథకం కింద ఆర్థిక సహాయం పొందేందుకు అర్హులన్నారు. జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సంజీవరావు మాట్లాడుతూ ఈ పథకం కింద మొదటి విడత రూ.లక్ష రుణం మంజూరు చేస్తారని, నిర్ణీత వ్యవధిలో చెల్లించిన వారికి తిరిగి రూ.2 లక్షల రుణం మంజూరు చేస్తారని పేర్కొన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ అండ్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కే.శివరామప్రసాద్.. పథకంపై వివరణాత్మక ప్రదర్శనను అందించారు. స్కీంలో నమోదు చేసుకోవడానికి దశలవారీ విధానంపై వివరించారు. కాగా.. అవగాహన సదస్సుకు 300 మంది హాజరయ్యారు. సమావేశంలో లాలా నగర్ డీఎఫ్‌వో శివకుమార్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఇందిర, లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంరెడ్డి, స్టీరింగ్ కమిటీ మెంబర్ ఆకుల నాగేశ్వరరావు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో రాజ్యాంగ విలువలు నిర్వీర్యం

టీపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలో ప్రొఫెసర్ హరగోపాల్

టీపీటీఎఫ్ సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న విద్యావేత్తలు

ఖమ్మం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 12: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నదని, తద్వారా రాజ్యాంగ విలువలు నిర్వీర్యమవుతున్నాయని పౌర హక్కుల ఉద్యమకారుడు ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. ఖమ్మం నగరంలోని నయాబజార్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన టీపీటీఎఫ్ రాష్ట్ర మహాసభల ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ విధానాలతో దేశం ఆర్థిక సంక్షోభంలోకి కూరుకుపోతున్నదన్నారు. విద్యా కార్పొరేటీకరణ, మతతత్వ రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధ్యాయ సంఘాలు విద్యకు సంబంధించిన ఉద్యమాల్లో నామమాత్రంగా కాకుండా క్రియాశీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం 2020 జాతీయ విద్యా విధాన చట్టం ప్రైవేటీకరణను బలోపేతం చేసేలా ఉందన్నారు. రచయిత చందనా చక్రవర్తి మాట్లాడుతూ.. దేశంలో నిత్యం ఏదో ఒక చోట మహిళలపై లైంగిక దాడులు జరుగుతూనే ఉన్నాయని, ఎంతోమంది మహిళలు లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్నారన్నారు. అనంతరం సంఘానికి సంబంధించిన సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ ప్రసాద్, వీక్షణం పత్రిక ఎడిటర్ వేణుగోపాల్, ఎన్‌సీఈఆర్‌టీ ప్రొఫెసర్ బుర్రా రమేష్, టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వై.అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, సంఘం సభ్యులు నాగిరెడ్డి, ప్రకాశ్‌రావు, అజయ్‌బాబు, నర్సింహారెడ్డి, రామాచారి, శశిధర్‌రెడ్డి, రవీందర్, కనకయ్య, నారాయణమ్మ, కవిత, పద్మ, విజయ్ పాల్గొన్నారు.

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ఉన్నతాధికారుల బదిలీ

- భద్రాద్రి డీఆర్‌డీవోగా విద్యాచందన.. జడ్పీ సీఈవోగా ప్రసూనారాణి..
- సూర్యాపేటకు మధుసూదన్‌రాజు.. మహబూబాబాద్‌కు రమాకాంత్..

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 12 (నమస్తే తెలంగాణ): పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని ఉన్నతాధికారుల బదిలీలు కూడా ప్రారంభమయ్యాయి. ఈ మేరకు భద్రాద్రి జిల్లా అధికారులను పొరుగు జిల్లాలకు, అక్కడి అధికారులను భద్రాద్రి జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జడ్పీ సీఈవో విద్యాలతను హనుమకొండకు, ములుగు జడ్పీ సీఈవో ప్రసూనారాణిని భద్రాద్రికి బదిలీ చేశారు. భద్రాద్రి డీఆర్‌డీవో మధుసూదన్‌రాజును సూర్యాపేటకు, ఖమ్మం డీఆర్‌డీవో విద్యాచందనను భద్రాద్రికి బదిలీ చేశారు. అలాగే, భద్రాద్రి డీపీవో రమాకాంత్‌ను మహబూబాబాద్‌కు, పెద్దపల్లి డీపీవో చంద్రమౌలిని భద్రాద్రికి బదిలీ చేశారు. ఇక్కడి జడ్పీ డిప్యూటీ సీఈవో నాగలక్ష్మిని ఖమ్మం డిప్యూటీ సీఈవోగా బదిలీ చేసి.. ఖమ్మం నుంచి వచ్చే చంద్రశేఖర్‌ను ఆమె స్థానంలో నియమించారు. కొత్తగూడెం సీడీపీవో స్వర్ణలత లెనినా ములుగు జిల్లా సంక్షేమాధికారిగా బదిలీ అయ్యారు. కొత్తగూడెం అడిషనల్ డీఆర్‌డీవో (సెర్ప్) నీలయ్యను ఖమ్మానికి, ఖమ్మం అడిషనల్ డీఆర్‌డీవో జయశ్రీని కొత్తగూడేనికి బదిలీ చేశారు.

ఖమ్మం జిల్లా నుంచీ స్థానచలనాలు..

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 12: ఖమ్మం జిల్లా నుంచి వివిధ శాఖల జిల్లా అధికారులకు స్థానచలనం కల్పిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ప్రధాన కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం జడ్పీ సీఈవో వీవీ అప్పారావును సూర్యాపేట జడ్పీ సీఈవోగా బదిలీ చేశారు. హైదరాబాద్ టీఎస్ఐఆర్‌డీ సీఈవో ఎస్.వినోద్‌ను ఖమ్మం జడ్పీ సీఈవోగా నియమించారు. ఖమ్మం జడ్పీ డిప్యూటీ సీఈవో కే.చంద్రశేఖర్‌ను భద్రాద్రి జిల్లాకు, అక్కడి డిప్యూటీ సీఈవో బీ.నాగలక్ష్మిని ఖమ్మం జిల్లాకు అదే హోదాల్లో బదిలీ చేశారు. ఖమ్మం డీఆర్‌డీవో ఎం.విద్యాచందనను భద్రాద్రి డీఆర్‌డీవోగా, మహబూబాబాద్ డీఆర్‌డీవో ఆర్.సన్యాసయ్యను ఖమ్మం డీఆర్‌డీవోగా నియమించారు. ఖమ్మం అదనపు డీఆర్‌డీవో శిరీషను సూర్యాపేట జడ్పీ డిప్యూటీ సీఈవోగా బదిలీ చేశారు. ఆమె స్థానంలో ఎవరినీ నియమించలేదు.భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి కీసర ఆర్‌డీవోగా బదిలీ అయ్యారు.

ఎక్సైజ్ శాఖలో సీఐలు..

ఖమ్మం జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ శాఖలో పలువురు సీఐలను బదిలీ చేస్తూ కమిషనర్ ఈ.శ్రీధర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్-1 సీఐ కే.రాజు ఖిలా వరంగల్ స్టేషన్‌కు బదిలీ చేసి ఆ స్థానంలో మహబూబాబాద్ జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ బీ.కృష్ణను నియమించారు. వైరా సీఐ వేమిరెడ్డి రమ్యను భూపాలపల్లి సీఐగా బదిలీ చేసి ఆ స్థానంలో యూబీ నాచారం సీఐ మమతను, ఖమ్మం ఎక్సైజ్ స్టేషన్-2 సీఐ ఆర్.రాజును మణుగూరు బదిలీ చేసి ఆ స్థానంలో ఖిలా వరంగల్ సీఐ చంద్రమోహన్‌ను, నేలకొండపల్లి సీఐ కే.పోశెట్టిని పెద్దపల్లికి బదిలీ చేసి ఆ స్థానంలో పరకాల సీఐ కే.జగన్నాథరావును, మధిర సీఐ ఎం.ప్రసాద్‌ను పాల్వంచకు బదిలీ చేసి ఆ స్థానంలో మణుగూరు సీఐ రామ్మూర్తిని, సత్తుపల్లి సీఐ వీ.రాజశేఖర్‌రావును వేములవాడకు బదిలీ చేసి ఆ స్థానంలో భూపాలపల్లి సీఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని, సింగరేణి సీఐ జుల్ఫీకర్‌అహ్మద్‌ను ఇచ్ఛోడకు బదిలీ చేసి ఆ స్థానంలో కాటారం సీఐ ఎం.ప్రశాంతిని, ఖమ్మం జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ ఆర్.విజేందర్‌ను ఆదిలాబాద్‌కు బదిలీ చేసి ఆ స్థానంలో హనుమకొండ ఐఎంఎల్ డిపో-1 సీఐ బీ.కరుణశ్రీని, ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వై.సర్వేశ్వరరావును జగిత్యాల సీఐగా బదిలీ చేసి ఆ స్థానంలో రామగుండం సీఐ ఎస్.రమేశ్‌ను, ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ పీ.శామ్యుల్ జాన్‌ను కాగజ్‌నగర్‌కు బదిలీ చేసి ఆ స్థానంలో ఆదిలాబాద్ సీఐ సీహెచ్ శ్రీనివాస్‌ను నియమించారు. బదిలీ ఉత్తర్వులు అందుకున్న అధికారులు వెంటనే వారి స్థానాల్లో విధుల్లో చేరాలని ఆదేశించారు.

రామాలయంలో ఇక ఈ-టికెట్

కంప్యూటర్ టికెట్లను అందజేస్తున్న ఆలయ ఈవో రమాదేవి

భద్రాచలం, ఫిబ్రవరి 12 : భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానంలో అన్ని పూజలు, దర్శనాలకు కంప్యూటర్ ద్వారా టికెట్లు(ఈ-టికెట్) ఇచ్చే ప్రక్రియకు సోమవారం నుంచి శ్రీకారం చుట్టారు. ఈ విధానాన్ని దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి ప్రారంభించారు. ఇదివరకు పేపర్‌పై ముద్రించిన టికెట్లను కౌంటర్ల ద్వారా భక్తులకు అందించేవారు. ఇక నుంచి అంతా పారదర్శకంగా జరిగేందుకు ఈ విధానాన్ని చేపట్టారు.

విక్రయానికి 60 వేల బస్తాలు రాక

తేజా రకం మిర్చి క్వింటా ధర రూ.22,300

ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 12 : ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం తేజా రకం మిర్చి క్వింటా ధర రూ.22,300 పలికింది. మార్కెట్‌లో వారం రోజుల నుంచి మిర్చి ధర తగ్గుతూ.. పెరుగుతుండడంతో రైతులు సరుకును విక్రయానికి తరలించారు. జెండాపాట తర్వాత వచ్చిన మిర్చి బస్తాలను యార్డు బయటే రైతులు దిగుమతి చేసుకోవాల్సి వచ్చింది. ఉదయం జరిగిన జెండాపాటలో గరిష్ఠ ధర క్వింటాకు రూ.22,300 పలకగా.. స్వల్పంగా రేటు పెరిగినట్లైంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. తేజా రకం మిర్చి గరిష్ఠ ధర క్వింటా రూ.22,300, మధ్య ధర క్వింటా రూ.20 వేలు, కనిష్ఠ ధర క్వింటాకు రూ.14 వేల చొప్పున నిర్ణయించి ఖరీదుదారులు కొనుగోలు చేశారు. తాలు రకం పంట గరిష్ఠ ధర క్వింటా రూ.12 వేలు పలికింది. సాయంత్రం వరకు యార్డులో క్రయవిక్రయాలతోపాటు కాంటాలు, తోలకాలు పూర్తయ్యాయి. మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి ప్రవీణ్‌కుమార్.. జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎంఏ.అలీంతో కలిసి పర్యవేక్షణ చేశారు.

భక్తాగ్రేసరుడు శ్రీరామదాసు

- భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ ఏఈవో శ్రావణ్‌కుమార్
- నేలకొండపల్లిలో శ్రీరామదాసు జయంత్యుత్సవాలు షురూ

శ్రీరామదాసు విగ్రహానికి నివాళులర్పిస్తున్న సాయిటీ సభ్యుల

భక్తరామదాసు ధ్యాన మందిరంలో కీర్తనలు ఆలపిస్తున్న గాయకులు

కూసుమంచి (నేలకొండపల్లి), ఫిబ్రవరి 12: తెలుగు ప్రజలు గర్వించదగిన వాగ్గేయకారుడు.. భక్తాగ్రేసరుడు శ్రీరామదాసు(కంచెర్ల గోపన్న) అని భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ ఏఈవో శ్రావణ్‌కుమార్ కొనియాడారు. శ్రీరామదాసు స్వస్థలమైన ఖమ్మం జిల్లాలోని నేలకొండపల్లి మండల కేంద్రంలో సోమవారం జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీ భక్త రామదాస విద్వత్ కళాపీఠం సౌజన్యంతో మరో రెండు రోజుల పాటు ఉత్సవాలు జరుగనున్నాయి. తొలిరోజు ఉత్సవాలకు శ్రావణ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నేలకొండపల్లిలోని ధ్యాన మందిరంలో ఉత్సవాలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భద్రాచలంలో రాముడి గుడి నిర్మాణంలో శ్రీరామదాసు కృషి ఎనలేనిదన్నారు. శ్రీరామదాసు దక్షిణ భారతదేశంలో ప్రఖ్యాతి గాంచిన వాగ్గేయకారుడన్నారు. అనంతరం సంగీత విద్యాంసుల నవరత్న గోష్ఠి వీనుల విందుగా సాగింది. రాష్ట్ర నలుమూలల నుంచి విచ్చేసిన విద్యాంసులు, గాయకులు శ్రీరామదాసు కీర్తనలను ఆలపించారు. ధ్యానమందిరంలో శ్రీరామచంద్రస్వామి ఆలయంలోని స్వామివారికి కంచెర్ల గోపన్న పదోతరం వారసుడు కంచెర్ల శ్రీనివాస్ పట్టువస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో శ్రీ భక్త రామదాస విద్వత్ కళాపీఠం అధ్యక్షుడు సాధు రాధాకృష్ణ మూర్తి, జిల్లాపరిషత్ వైస్ చైర్ పర్సన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీపీ వజ్జా రమ్య, ఎంపీటీసీలు దోసపాటి కల్పన, బొడ్డు బొందయ్య, శీలం వెంకటలక్ష్మి, భక్త రామదాసు సర్వీస్ సోసైటీ అధ్యక్షుడు పాలడుగు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంలో శ్రీరామదాసు జయంత్యుత్సవాలు ప్రారంభం

భద్రాచలం, ఫిబ్రవరి 12: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ సన్నిధిలో సోమవారం వాగ్గేయకారుడు శ్రీరామదాసు (కంచెర్ల గోపన్న) జయంత్యుత్సవాలు ప్రారంభమయ్యాయి. దేవస్థానంతో పాటు శ్రీచక్ర సిమెంట్స్, నాద సుధా తరంగిణి కల్చరల్ ట్రస్ట్, సామగాన లహరి కల్చరల్ ట్రస్ట్, నేండ్రగంటి అలివేలు మంగ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు ఉత్సవాలు జరుగనున్నాయి. తొలిరోజు ఉత్సవంలో భాగంగా అర్చకులు ఆలయ ప్రాంగణంలోని శ్రీరామదాసు విగ్రహానికి పంచామృతాలతో అభిషేకించారు. మేళ తాళాలు, వేద మంత్రోచ్చరణ నడుమ శ్రీరామదాసు చిత్రపటంతో ఆలయ ప్రదక్షిణ, గిరి ప్రదక్షిణ చేశారు. ఆలయ పరిధిలోని చిత్రకూట మండపంలో సంగీత విద్వాంసులు మల్లాది బ్రదర్స్ పర్యవేక్షణలో మందలాది మంది గాయకులు శ్రీరామదాసు కీర్తనలను ఆలపించారు. వేడుకల్లో చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధానార్చకుడు సౌందర్య రంగరాజన్, భద్రాచలం రామాలయ ఈవో ఎల్.రమాదేవి, ఆలయ ప్రధానార్చకులు అమరవాది విజయరాఘవన్, పొడిచేటి సీతారామానుజాచార్యులు, దేవస్థాన ఆస్థాన స్థానాచార్యులు కేఈ స్థలశాయి పాల్గొన్నారు.

కోడిపందేలు @ సీజీ మారాయిగూడెం

- దుమ్ముగూడెం మండల సరిహద్దులోని ఛత్తీస్‌గఢ్ గ్రామంలో నిర్వహణ
- సంక్రాంతి తర్వాత నుంచి వేసవి వరకూ వారానికి మూడు రోజులు పందేలు
- దుమ్ముగూడెమే ప్రధాన మార్గం కావడంతో ఇక్కడి నుంచే రాకపోకలు
- అట్టహాసంగా జూదరుల ఏర్పాట్లు.. చేతులు మారుతున్న రూ.లక్షలు..

ఇటీవల సీజీ మారాయిగూడెం వద్ద కోడిపందేల కోసం బారులు తీరిన వాహనాలు, టెంట్లు వేసి జాతరను తలపిస్తున్న కోడిపందేల స్థావరం(ఫైల్)

పర్ణశాల, ఫిబ్రవరి 12 : దుమ్ముగూడెం మండల సరిహద్దులో ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని సీజీ మారాయిగూడెం గ్రామం కోడిపందేలకు చిరునామాగా ఉంది. సంక్రాంతి ముగిసిన ప్రతి నుంచి వేసవి వరకూ ఇక్కడ జోరుగా కోడిపందేలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. సీజీ మారాయిగూడెం వెళ్లేందుకు దుమ్ముగూడెమే ప్రధాన మార్గం కావడంతో ఈ ప్రాంతం జూదరులు, పరిసర ప్రాంతాల జూదరులు ఇక్కడి నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. తెలంగాణలో కోడిపందేలపై నిషేధం ఉండడంతో భద్రాచలం, దుమ్ముగూడెం ప్రాంతాలకు చెందిన కొందరు జూదరులు సీజీ మారాయిగూడెంలో ఏటా కోడిపందేలు నిర్వహిస్తుంటారు. సంక్రాంతి సీజన్‌లో ఆంధ్రాలో ముగిసిన తరువాత ఇక్కడ మొదలవుతాయి. ఇక్కడి పందేలకు స్థానికులతోపాటు ఏపీ, తెలంగాణలోని ముఖ్య పట్టణాల నుంచి కూడా